## అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హత్నూర, ఏప్రిల్13 : మండల కేంద్రమైన హత్నూరలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల 2010-11 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాళ్లు అశోక్, రసూల్, అధ్యాపకులు గోవర్ధన్, రవి, రాజు, శ్రీహరి, నాగరాజు, జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప జాతర



వట్‌పల్లి మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో కొలువైన బీరప్పస్వామి ఉత్సవాలు అదివారం వైభవంగా జరిగాయి. సంప్రదాయబద్ధంగా గొల్ల, కురుమలు ఉత్సవాలను నిర్వహించారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**-వట్‌పల్లి, ఏప్రిల్ 13**

## రైల్వే లైన్‌కు మరమ్మతులు



కోహీర్‌లో రైల్వే పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోహీర్, ఏప్రిల్ 13 : కోహీర్ పట్టణంలోని రైల్వే గేటు నంబర్ 24 సమీపంలో ఆదివారం రైల్వే శాఖ అధికారులు పట్టాలకు మరమ్మతులను ప్రారంభించారు. ఈ నెల 17న సాయంత్రం ఆరు గంటల వరకు మరమ్మతులు నిర్వహిస్తామని, వాహనదారులు ఇతర మార్గాలను ఎంచుకోవాలని జహీరాబాద్ సెక్షన్ ఇంజినీర్ వేణు, ఏఈ స్వామి సూచించారు. రైల్వే గేటును మూసివేసినా కొంతమంది కింది నుంచి దాటుతున్నారని, ఆ సమయంలో రైలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వాహనదారులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు.

## కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

సదాశివపేట, ఏప్రిల్ 13 : మహాత్మా బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ కరపత్రాన్ని చౌకి మఠంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం చౌకి మఠం అధ్యక్షుడు చీల మల్లన్న మాట్లాడుతూ బసవ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 30న కళెట్టి వెంచర్‌లో బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ ఉంటుందని, కావున వీరశైవ లింగాయత్ అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అనంతరం బసవేశ్వరుడి జయంతి ఉత్సవాల్లో భాగంగా బసవ సేవా సదన్‌లో హైదరాబాద్ యశోద దవాఖాన సహకారంతో ఆర్థోపెటిక్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, గౌరవ అధ్యక్షుడు బోడగామ శ్రీశైలం, ఎడ్ల బజార్ సమాజం అధ్యక్షుడు గందిగ రాజు, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

### సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు



వేడుకల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 13 : పోరాటాల ద్వారానే హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలోని జేపీ ఫంక్షన్‌హాల్‌లో శాండ్విక్ పరిశ్రమ 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడు చుక్కరాములు, శాండ్విక్ పరిశ్రమ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, మన తెలంగాణ పత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్, శాండ్విక్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృపేందర్ ఈ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. 40 ఏండ్ల శాండ్విక్ కంపెనీలో ఒకే ఒకే యూనియన్ విజయవంతంగా నడుస్తుండటం చారిత్రాత్మకం అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాండురంగారెడ్డి, శాండ్విక్ ప్లాంట్ హెడ్ అభిజిడ్ హడప్, వైస్ ప్రెసిడెంట్ జయప్రకాశ్, హెచ్‌ఆర్ హెడ్ నాగవేణి బాజ్‌పాయి, తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గుమ్మడిదల, ఏప్రిల్ 13 : మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బీర్ల నాగరాజు (30) 15 నెలల కింద కొండాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన అనితతో వివాహమైంది. తరుచూ భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లేది. పెద్ద మనుషుల సమక్షంలో భార్యాభర్తలకు నచ్చ చెప్పారు. ఆదివారం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు నాగరాజు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య తరుచూ గొడవపడి పుట్టింటికి వెళ్తున్న కారణంగా నాగరాజు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై మహేశ్వర్ రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

## చికిత్స పొందుతూ విషమించి కార్మికుడు మృతి

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 13 : పనిచేస్తున్న ప్రదేశంలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కిర్బి కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్ భానూర్ ఎస్‌హెచ్‌వో స్వామిగౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ బారబంక్తి జిల్లాకు చెందిన దేవేంద్ర (26) ఉపాధికోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి వచ్చి నివసిస్తున్నాడు. పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బి పరిశ్రమలో పౌడర్ కోటింగ్ విభాగంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 5న కంపెనీలో పనిచేస్తున్న సందర్భంలో అతడికి పౌడర్ కోటింగ్ మేషిన్ హుక్‌లపై పేరుకున్న మెయింట్ మరకలను తొలిగించే పనిని అప్పగించారు. థిన్నర్ వాడి కాల్చే క్రమంలో భారీగా మంటలు చెలరేగి అతడి శరీరానికి అంటుకున్నాయి. తీవ్రగాయాలకు గురైన దేవేంద్రను నగరంలోని శ్రీకర దవాఖానకు తరలించారు. అక్కడ అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని డీఆర్డీవో అపో లో దవాఖానకు తరలించారు. చికిత్స పొం దుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కిర్బి పరిశ్రమ నిర్లక్ష్యంతోనే తన భర్త దేవేంద్ర మృతి చెందాడని భార్య స్వరూప ఫిర్యాదు చేసింది. పరిశ్రమలో సేఫ్టీ లోపించడంతోనే భర్త అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నాడని పేర్కొన్నారు. భర్త మృతిపై విచారణ చేయలని అధికారుల ను కోరింది. కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

# బహిరంగ సభకు ఊరూరా కదలిరావాలి

### ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



ఎమ్మెల్యే మాణిక్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మొగుడంపల్లి కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్, ఏప్రిల్ 13 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఊరు నుంచి కదలిరావాలని పార్టీ శ్రేణులకు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం జహీరాబాద్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని కన్వెన్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాల పట్ల ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. మండలాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొ నింటి మాణిక్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్ బల్‌రాజ్, మాజీ సర్పంచ్ సిద్ధప్ప, నాయకులు అనిల్, దేవయ్య, సాల్మన్, రఫీ, రాజు, శివకుమార్, సిద్ధు, గోపాల్, పవన్ కుమార్ తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, తట్టునారాయణ, వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు గండప్ప, విజయ్ కుమార్, గోపాల్, ఈశ్వర్‌రెడ్డి, రాం శెట్టి, సీతారాంరెడ్డి, భరత్‌రెడ్డి, షకీల్, చందు జాదవ్, కిషన్ పాల్గొన్నారు.

### రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సిర్గాపూర్ : కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, ఏప్రిల్ 13 : బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిర్గాపూర్ మండల కేంద్రంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ దిగ్గజ నేత మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంజీవరావు పాటిల్, నాయకులు మాధవరావు, యాదవరావు పాటిల్, సాయాగౌడ్, రవీందర్, బాలాజీ, నారాయణ, విజయ్, రమేశ్ భూషణం ఉన్నారు.

# తాగు నీరు అందించండి

### రోజు రోజుకూ తీవ్రమవుతున్న నీటి సమస్య



హన్‌మాన్ మందిరం సింగిల్ ఫేస్ మోటరు వద్ద నీటి కోసం పోటీ పడుతున్న మహిళలు

కల్హేర్, ఏప్రిల్ 13 : కల్హేర్ మండల పరిధిలోని మార్డి లో తాగు నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 10 సింగిల్ ఫేస్ మోటర్లు ఉండగా అందులో ఐదు బోరు బావులు ఎండి పోయాయి. గ్రామంలోకి నీటిని సరఫరా చేసేందుకు ట్యాంక్‌లోకి తరలించే బోరులో నీరు తగ్గిపోయింది. దీనికి తోడు కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు తెలిపారు. బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో పాటూ మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలో తాగు నీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. సింగిల్ ఫేస్ మోటర్లు ఉన్న ఇంటి యజమానులను ప్రాధేయపడి తీసుకుంటున్నామని కొందరు తెలిపారు. గ్రామంలో కొన్ని గల్లీలకు సరిపోను నీరు వస్తున్నాయని, చాలా గల్లీల్లో తీవ్ర ఇబ్బంది ఉందన్నారు. రోజు ట్యాంకర్‌తో నాలుగు ట్రిప్పులు సరఫరా చేస్తున్నామని వాటర్‌మెన్ తెలిపారు. నీరు లేకపోతే ఇంట్లో ఏ పనులు చేసుకోవడం కష్టతరమని అందుకోసం ఒక డ్రమ్ము నీరు రూ. వందకు తీసుకుంటున్నామని గ్రామానికి చెందిన గడీల నారాయణ తెలిపారు. గ్రామంలో ఉన్న సింగిల్ ఫేస్, గ్రామ శివారులో ఉన్న బోరు బావులను అద్దెకు తీసుకొని తాగునీటి సమస్యను తీర్చాలని అధికారులను కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోరుబావులను అద్దెకు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని ఎంపీడీవో రమేశ్‌బాబు తెలిపారు. పెద్ద గ్రామ పంచాయతీలో 4, చిన్న చిన్న గ్రామ పంచాయతీల్లో 2 నుంచి 3 వరకు బోరు బావులను అద్దె తీసుకునేందుకు ప్రదిపాదనలు పంపించమన్నారు.



ఎండిపోయిన సింగిల్ ఫేస్ బోరుబావి

### మెయిన్ పైపు లీకేజీతో సమస్య

మండల కేంద్రమైన సిర్గాపూర్ సమీపంలో ఆర్ అండ్‌బీ పనులు కొనసాగుతున్న క్రమం లో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ అయ్యింది. దీంతో నీటి సరఫరాను నిలిపి వేసి లీకేజీకి మరమ్మతులు చేశామని ఏఈ తిరుమలేశ్ తెలిపారు. సమస్య తీరిపోవడంతో నేడు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తామన్నారు.

## 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చౌటకూర్, ఏప్రిల్ 13 : మండలంలోని తడ్దానిపల్లి గ్రామ శివారులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ సిబ్బందితో ఆదివారం తెల్లవారుజామున సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి తడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మహీంద్రా బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా, ఎలాంటి పత్రాలు లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ పౌర సరఫరాల విభాగం అధికారులకు సమాచారం అందించారు. అనుమతి లేకుండా 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



గుమ్మడిదలలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 13 : ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు ఆదివారం 68వ రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలో గుమ్మడిదల, దోమడుగు గ్రామస్తులు జగ్గారెడ్డిబాల్‌రెడ్డి, మద్ది బాల్‌రెడ్డి, మద్దిమోహన్ రెడ్డి, పుట్ట ఎల్లయ్య, పెంటా రెడ్డి, రాము, దీక్షలో పాల్గొన్నారు. వీరికి గుమ్మడిదల రైతు జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. కొత్తపల్లి నల్లవల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి డంపింగ్‌యార్డ్‌కు ఇచ్చిన అనుమతులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, స్వేచ్ఛ రెడ్డి, భిక్షపతి రెడ్డి, సూర్యనారాయణ, జయపాల్ రెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయులు, సంజీవరెడ్డి, రంగనాథచార్యులు, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు అయూబ్, రవి, శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, వినోద్, రవీందర్ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యర్థాలతో రంగు మారుతున్న కుంట నీరు

### సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కు సమీపంలో కుంటలోకి వ్యర్థాలను వదులుతున్న పరిశ్రమలు



సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కు సమీపంలో ఉన్న కుంటలో రంగుమారిన నీరు

పటాన్‌చెరు, ఏప్రిల్ 13 : మెడికల్ డివైజ్ పార్కు సమీపంలో ఉన్న కుంటలోకి కాలుష్య నీటిని వదలడంతో నీరు రంగుమారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలో ఓఆర్‌ఆర్‌కు సమీపంలో కాలుష్యత రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కలిపించేందుకు మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేశారు. మెడికల్ డివైజ్ పార్కుల్లో అనేక అత్యాధునిక వైద్య పరికరాలు తయారు చేసే పరిశ్రమలు ఏర్పా టు చేశారు. పార్కు సమీపంలో ఉన్న కుంట లో పరిశ్రమలకు చెందిన వ్యర్థ పదార్థాలు, రసాయనాలు కుంటలోకి వదలడంతో నీరు రంగు మారిపోతుంది. పరిశ్రమలకు చెందిన వ్యర్థాలను కుంటల్లో పారబోయడంతో నీరు కాలుష్యం, కావడంతో పాటు భూగర్భ జలాలు సైతం కాలుష్యమవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల్లో ఉన్న వ్యర్థాలను బయట పారబోయకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు తగు చర్యలు తీసుకొని పరిశ్రమల నుంచి వ్య ర్థాలు, రసాయనాలు బయట పారబోయకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సస్య రక్షణ చర్యలతోనే పంటదిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన కళాశాల విద్యార్థులు

జహీరాబాద్, ఏప్రిల్ 13 : సస్య రక్షణ చర్యలతోనే కూరగాయల సాగులో అధిక దిగుబడిని సాధించవచ్చని కొండ లక్ష్మణ్ ఉద్యానవన కళాశాల విద్యార్థులు అన్నారు. ఆదివారం జహీరాబాద్ మండలంలోని రంజోల్‌లో విద్యార్థులు తమ గ్రామీణ ఉద్యానవన అనుభావ కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన టమాట పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా టమాట పంటకు అశించిన తెల్ల, పచ్చ దోమ నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి

గుమ్మడిదల, ఏప్రిల్ 13 : గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన సఫాయి కార్మికురాలు రాజమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. సమాచారం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, స్థానిక నాయకులు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బీఆర్‌ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్ గౌడ్, నాయకులు కాలకంటి బాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

### రైతు మృతికి కారణమైన విద్యుత్ సిబ్బందిని సస్పెండ్ చేయాలి

చౌటకూర్, ఏప్రిల్ 13 : పుల్కల్ మండలం మిన్‌పూర్ గిరిజన తండాలో రైతు రమావత్ రమేశ్ మృతికి కారణమైన విద్యుత్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. గిరిజన తండా సమీపంలోని వరి పొలంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన తీగలు తెగిపడినప్పటికీ, నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సిబ్బంది విధుల పట్ల వహించిన నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయిందని విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## గుర్రపుడెక్కను తొలిగించాలి



కొన్యాల శివారు మంజీరనదిలో గుర్రపుడెక్క

హత్నూర, ఏప్రిల్13 : హత్నూర మండలం కొన్యాల శివారులోని మంజీరానది బ్రిడ్జివద్ద అరకిలోమీటరు మేర నదిలో గుర్రపుడెక్క పర్చుకున్నది. దీంతో మూగజీవాలు నీరుతాగడానికి వీలులేకుండా మారింది. నీటిలోపడితే వాటిని గుర్తించలేని స్థితికి చేరాయి. చేపలు పట్టడానికి మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే గుర్రపు డెక్కను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా మట్టల పండుగ



కాసాలలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న క్రైస్తవులు

హత్నూర, ఏప్రిల్ 13 : హత్నూర మండలంలో క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. కొన్యాల, చీకమద్దూర్, కాసాల, రెడ్డిపాలెం ముచ్చర్ల, దౌల్తాబాద్ తదితర గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని మట్టలు చేతపట్టి పురవీధులగుండా తిరుగుతూ ఏసుక్రీస్తు నామం జపించారు. కార్యక్రమంలో రెవరెండ్ కాంతారావు, అమృతరావు, ఫాస్టరేట్ కమిటీ సభ్యులు భాస్కర్, ప్రభాకర్, సుభాష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే లక్ష్యం

రామచంద్రాపురం, ఏప్రిల్ 13 : యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యమని స్టెప్‌ఐటీ సంస్థ ఫౌండర్ దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఆర్సీపురం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దిలీప్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై స్టెప్ ఐటీ సంస్థను ప్రారంభించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చదువుకున్న వారందరికి ఏదో ఒక రంగంలో ఉపాధి సాధించాలన్నదే స్టెప్‌ఐటీ లక్ష్యమని తెలిపారు.

# భవిష్యత్ చూపిస్తున్న 'భవిష్య భారత్'

### గ్రామాల్లో కొనసాగుతున్న సేవాకార్యక్రమాలు

మనూరు, ఏప్రిల్ 13 : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నో సేవాల కార్యక్రమాలు చేపడుతూ యువకులను చైతన్య వంతులను చేస్తూ ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ముందుకు సాగుతున్నది . 2008లో దేశంలో సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నది. నూతనంగా భవిష్య భారత్ స్వచ్ఛంద సేవాసంస్థ ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2020లో తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలో 5 గ్రామాలను ఎంపిక చేసింది. వాటిలో ధన్వార్, ఇస్లాంపూర్, ఉసిరికెపల్లి, తుమ్నూర్, ముగ్ధూంపూర్ గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో గ్రామ పెద్దలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ సభ్యులతో ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తూ, ఆ నెలలో చేయవల్సిన కార్యక్రమాలపై చర్చించి వాటిని అమలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకమైన నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచితంగా మినరల్ వాటర్‌ను అందిజేస్తున్నారు. పారిశుధ్యం కోసం ప్రధాన కూడళ్లల్లో పెద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎల్ఈడీ బల్బులు, ఏర్పాటుతో పాటు ప్రధాన కాలనీల్లో సోలార్ బల్బులను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో నూతన కార్యక్రమాలు చేపడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవా సంస్థ పలువురి మన్ననలు పొందుతుంది. గ్రామాల్లో యువకులకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ట్రైనింగ్ ప్రారంభించిన తర్వాత 2024లో గ్రామం నుంచి ఇద్దరు ఆర్మీ శిక్షణలో చేరేందుకు ఎంపిక కాగా, 2025 సంవత్సరానికి ఏడుగురు అభ్యర్థులు భారత సైన్యంలో ఎంపిక జరిగిందని భవిష్య భారత్ సంస్థ మేనేజింగ్ ట్రస్ట్ మాజీ లెఫ్ట్ నెంట్ జనరల్ హరిప్రసాద్ తెలిపారు.





రాయిపల్లిలో యువకులకు ఆర్మీ శిక్షణ ఇస్తున్న ట్రైనర్స్ (ఫైల్)

### ప్రతి రోజు యోగా కార్యక్రమాలు

గ్రామాల్లోని యువత చెడు మార్గంలో పయనించకుండా యువకులకు ప్రత్యేకంగా ప్రతి రోజు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భవిష్య భారత్ సభ్యులు తెలుపుతున్నారు. ప్రతి రోజు నిర్వహిస్తున్న కార్యక్రమానికి యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని వెల్లడించారు. యోగా తరగతులు ప్రారంభించిన మొదటలో అంతత మాత్రంగా ఉన్న నేడు అత్యధిక సంఖ్యలో యువకులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

### శిక్షణ బాగుంది..



ఆర్మీలో చేరేందుకు ఇస్తున్న శిక్షణ చాలా బాగుంది. గ్రామీణ ప్రాంత యువకుల కోసం ప్రత్యేకంగా దృష్టి సారించి ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ ఆధ్వర్యంలో ఆసక్తి గల యువకులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇలాంటి శిక్షణ మాలాంటి యువకులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నది. ఈ శిక్షణ ద్వారానే నేను ఆర్మీకి ఎంపిక అయ్యా. గ్రామంలో యువకుల కోసం స్వచ్ఛంద సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

**-పాండు, ఉసిరికెపల్లి, మనూరు మండలం**